క్లుప్తంగా

19న ఉగాది వేడుకలు

చీరాల అర్బన్: సామాజిక, సాహితి, సాంస్కృతిక సేవా సంస్థ బత్తుల సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో శోభకృత్ నామ సంవత్సర తెలుగు ఉగాది వేడుకలను ఆదివారం రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షులు బత్తుల బ్రహ్మారెడ్డి మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులకు పురస్కారాలు అందిస్తామని తెలిపారు.

100 శాతం పన్ను వసూలు చేయాలి

చీరాల టౌన్: గ్రామాల్లో పెండింగ్ బకాయిలు, ఇంటి పన్నుల వసూళ్లను మార్చి నెలాఖరులోపు 100 శాతం చేయాలని ఈవోఆర్డీ మురళీబాపూజి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో మాట్లాడారు. గ్రామాల వారీగా ఇంటి పన్నుల బకాయిలు పేరుకుపోవడంతో అభివృద్ధికి అడ్డంకిగా మారిందన్నారు. పంచాయతీలు గ్రామాల్లోని బిల్లు కలెక్టర్లు, వలంటీర్లతో మార్చి నెలాఖరులోపు పన్నుల వసూళ్లు పూర్తి చేయాలన్నారు. ప్రతి పంచాయతీకి విధిగా ఫాగింగ్ యంత్రం కొనుగోలు చేసి వినియోగించి దోమల నిర్మూలన చర్యలు చేపట్టారు.

హక్కులపై అవగాహన ఉండాలి

చీరాల టౌన్: వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవాలని వినియోగదారులు సంరక్షణ సంఘం కార్యదర్శి దాసరి ఇమ్మానియేల్ సూచించారు. మార్చి 15 ప్రపంచ వినియోగదారుల రక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పలు ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వినియోగదారులకు ఉన్న హక్కులు, వస్తుసేవల్లో జాప్యం, నష్ట పరిహారం పొందడం, నాణ్యమైన వస్తువులనే వినియోగించేలా ప్రోత్సహించడం తదితర అంశాలపై కలెక్టర్ కార్యాలయంలో సదస్సు నిర్వహిస్తున్నామని ప్రజలు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

సంతమాగులూరు (అద్దంకి): బైకు అదుపు తప్పి ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని బల్లికురవ రోడ్డులో మంగళవారం జరిగింది. మిన్నెకల్లు గ్రామానికి చెందిన రాము, అంజమ్మ ద్విచక్రవాహనంపై సంతమాగులూరు వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో బల్లికురవ రోడ్డు వద్ద బైకు అదుపు తప్పడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

కారంచేడు: తన కుమారుని ద్విచక్రవాహనంపై నుంచి కింద పడటంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. బాపట్ల క్రిస్టియన్‌పేటకు చెందిన తంబళ్ళ రత్నకుమారి తన కుమారుడు వినయ్ ద్విచక్రవాహనంపై కారంచేడు మండలంలోని నందిగుంటపాలెంలో తమ బంధువుల ఇంట జరిగే అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వస్తున్నారు. ఈ క్రమంలో స్వర్ణ-నందిగుంటపాలెం గ్రామాల మధ్య వాహనంపై నుంచి కింద పడిపోయింది. దీంతో ఆమెను చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. రత్నకుమారి అపస్మారక స్థితికి చేరుకోవడంతో అక్కడ నుంచి మరింత మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రీసర్వేకు సహకరించాలి

బల్లికురవ: ప్రభుత్వం భూసమస్యలను పరిష్కరించేందుకు జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ పి. సీతారత్నం మంగళవారం కోరారు. ఇప్పటికే మండలంలోని వేమవరం, కూకట్లపల్లి, వల్లాపల్లి, వైదన, కొప్పరపాడు, బల్లికురవ,కొణిదెన గ్రామాల్లో రీసర్వే తుదిదశకు చేరిందని చెప్పారు. వేమవరం కొప్పరపాడు బల్లికురవ గ్రామాల్లో రీసర్వే పూర్తవటంతో పాస్ పుస్తకాలు పంపిణీ చేశామని మే నెలలో మరో ఆరు గ్రామాలు ఎంపిక చేసి రీసర్వే చేపడతామని వివరించారు.

నేడు ప్రపంచ వినియోగదారుల దినోత్సవం

చీరాల: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.ఐసయ్య మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.

చెరువులకు సాగర్ నీరు

బల్లికురవ: వేసవి దృష్ట్యా గ్రామాల్లో మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా మండలంలోని నోటిఫైడ్, నాన్‌నోటిఫైడ్ చెరువులన్నింటినీ సాగర్ నీటితో నింపుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరి నాయక్ మంగళవారం తెలిపారు. గ్రామాలోని రక్షిత పథకాల నుంచి నీరు వృథా కాకుండా ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

భూమి సారవంతంగా ఉంటే దిగుబడి

చీరాల టౌన్: అన్నదాతలు పంటల సాగుకు ముందు భూమి సారవంతం పెంచుకునేలా పప్పు ధాన్యాలు సాగు చేస్తే పంటల దిగుబడి అధికంగా వస్తుందని ఆర్‌బీకే చైర్మన్ కె.రమణారెడ్డి సూచించారు. మంగళవారం బుర్లవారిపాలెంలోని రైతు భరోసా కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సుతో పాటు ర్యాలీ నిర్వహించారు. రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకుని రాణించాలన్నారు.


అద్దంకి: మాత్రలు మింగిస్తున్న మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జయచంద్ర


చినగంజాం: విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ మింగిస్తున్న వైద్యాధికారులు


జె.పంగులూరు: విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యులు

నులిపురుగుల నివారణతో వ్యాధులు దూరం

కారంచేడు: నులిపురుగుల నివారణతో అన్ని రకముల వ్యాధులను దూరం అవుతాని పీహెచ్‌సీ వైద్యాధిరి డాక్టర్ కె.జెస్సీరాణి అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కారంచేడు యూపీ పాఠశాలలో విద్యార్థులకు ఆల్‌బెండజోల్-500 ఎంజీ మాత్రలను మింగించారు. ఎంపీడీఓ ఆర్. రమేష్‌బాబు, హెచ్‌ఎం సాబీరున్నీసా, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు. స్వర్ణ పీహెచ్‌సీలో డాక్టర్ షాలినీ మాత్రలను పంపిణీ చేశారు. హెచ్‌ఈ మీనా కుమారి పాల్గొన్నారు.

సంతమాగులూరు (అద్దంకి): ఎంపీడీవో సాంబశివ రావు మాట్లాడుతూ నులిపురుగులు కడుపులో ఉండటం కడుపులో నొప్పి వస్తుందని చెప్పారు. ఎంపీపీ, ఎంపీటీసీలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వేటపాలెం: డాక్టర్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ మండల పరిధిలోని 7,800 మందికి బిళ్లలు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. రక్త హీనతను అరికట్ట వచ్చని తెలిపారు.

జె.పంగులూరు: చందలూరు ఎంపీపీ పాఠశాలలో డాక్టర్ శివ చెన్నయ్య పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యద్దనపూడి: నులిపురుగుల నిర్మూలనతో ఆరోగ్యం సాధ్యమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ సుజాత అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రలు పంపిణీ చేశారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వైద్యాధికారి వీరబ్రహ్మం మందులు అందజేశారు. హెల్త్ అసిస్టెంట్ బి.కోటేశ్వరావు, ఏఎన్‌ఎం మాధవి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చినగంజాం: విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత అవసరం అని సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కె. కీర్తి సరోజ్ అన్నారు. సంతరావూరు ప్రాథమికోన్నత పాఠశాలలో టాబ్లెట్స్ మింగించారు. వైద్యాధికారి బి. నాగేంద్ర, పాఠశాల హెచ్‌ఎం పి. లక్ష్మి, ఏఎన్‌ఎం ఎన్. శాంతకుమారి, ఆశ కార్యకర్తలు, ఎఫ్‌పీసీ సూపర్‌వైజర్ జి. విజయ ప్రసన్న పాల్గొన్నారు.

మేదరమెట్ల: స్థానిక యర్రం చినపోలిరెడ్డి ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ ఎస్. వి. సుబ్బారావు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ప్రాసంగులపాడు ఆరోగ్య కేంద్రం డాక్టర్ యం. అనీష్, సీడీపీవో కృష్ణకుమారి ఆధ్వర్యంలో మాత్రలు మింగించారు.

అద్దంకి రూరల్: నులిపురుగుల నివారణతో ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని మోదేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఎస్. జయచంద్రరావు అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించారు. కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం, రక్త హీనత, నీరసంగా ఉంటారన్నారు. శారీరకంగా, మానసికంగా ఎదుగుదల కోల్పోతారన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి నీలం రామకోటేశ్వరరావు, మోదేపల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉప్పలపాడు, వెంపరాల గ్రామాల సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న నులిపురుగుల నివారణ కార్యక్రమాలను పర్యవేక్షించారు. అద్దంకి సమీపంలోని శింగరకొండ వద్ద నున్న కె.ఆర్.కె కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ మోహన్‌రావు ఆధ్వర్యంలో ఆల్‌బెండాజోల్ మాత్రలు మింగించారు.

బల్లికురవ: మల, మూత్రవిసర్జన తర్వాత, ఆహారం తినే ముందు చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహమ్మద్ కోరారు. మంగళవారం 10114 మందికి మాత్రలు మింగించారు. బల్లికురవ, కొప్పరపాడు అంగన్‌వాడీ సెక్టార్‌ల పరిధిలో పాతమల్లాయపాలెం, కొప్పరపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్ వైజర్లు నులిపురుగుల టాబ్లెట్ల ను మింగించారు.

చీరాల అర్బన్: పట్టణంలోని ఏఆర్‌ఎం హైస్కూల్‌లో మున్సిపల్ కమిషనర్ పి.ఐసయ్య మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మందు తీసుకోవడం వ్యాధి నిరోధక శక్తి, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు బి.సాల్మన్‌రాజు, ప్రభుత్వ వైద్యులు శిరీష, జాకబ్, స్వాతికిరణ్, జ్యోతిరావు, సైన్సు ఉపాధ్యాయులు పి.భానుచంద్రమూర్తి, వెలుగొండారెడ్డి, కుమార్, రమణారావు, హెల్త్ సెక్రటరీ సాయికుమారి, ఆశా కార్యకర్త రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు (చినగంజాం): డాక్టర్ ఎమీమా మాట్లాడుతూ నులిపురుగుల నివారణకు సంవత్సరంలో రెండుసార్లు మాత్రలు మింగిస్తారన్నారు. ఎస్ఆర్‌అండ్ వీఎస్ఆర్ బాలికోన్నత పాఠశాలలో మాత్రలు మింగించారు. ఆయా కార్యక్రమాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బీవీ కోటేశ్వరరావు, ఇంకొల్లు మండల హెల్త్ ఫస్ట్ ఎయిడర్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ రావినూతల శ్రీనివాసరావు, మండల ఆరోగ్య ఎంఎల్‌హెచ్‌పీ ఉషారాణి, నోడల్ అధికారి సహస్ర, హెచ్‌ఎం ఉదయకుమారి పాల్గొన్నారు.

పర్చూరు: నులిపురుగుల మాత్ర సేవనం పిల్లల ఆరోగ్యానికి మంచిదని ఎంపీడీఓ లక్ష్మీదేవి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఎంపీయూపీ స్కూలు, వైఆర్‌హెచ్‌ఎస్‌లో విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో మాత్రలు పంపిణీ చేశారు. ఎంఈఓ నాగేశ్వరరావు, హెచ్‌ఎంలు రాజశేఖర్, సురేష్, సీఆర్‌పీలు ఉమామహేశ్వరరావు, శశికుమార్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

పర్చూరు: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నాగులపాలెంలోని నాగుబడి రంగయ్య, అచ్చమ్మ బధిరుల పాఠశాలలో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎన్. శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. స్కూలు నిర్వాహకులు కోమటి ఆంజనేయులు, కార్యదర్శి సదానంద రెడ్డి, కె సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


పర్చూరు: విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ


మేదరమెట్ల: విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న సీడీపీవో


కారంచేడులో మాత్రలను మింగిస్తున్న మెడికల్ ఆఫీసర్, ఎంపీడీఓ


బల్లికురవ: కొణిదెనలో మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారి


యద్దనపూడిలో మాత్రలు మింగిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది


ఇంకొల్లు: బాలికలకు మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి అంజలి


చీరాల: మాత్రలు అందిస్తున్న మున్సిపల్ కమిషనర్


పర్చూరులో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న దృశ్యం

నీటి లభ్యత షురూ!


మండలంలో రైతులు ఏర్పాటు చేసుకున్న నీటి కుంట

- వ్యవసాయ భూముల్లో నీటి కుంటలు
- వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయం

మేదరమెట్ల: వర్షాభావానికి ఉద్యాన పంటలతోపాటు, కంది, మిరప వంటి పంటలు పండించే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఆరుగాలం పండించిన పంట, నోటిదాకవచ్చే సమయానికి, వర్షాలు లేక కళ్లముందే ఎండిపోతున్నా ఏమీ చేయలేని పరిస్థితుల్లో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ క్రమంలో వేసిన పంటలు ఎండిపోకుండా ఉండేందుకు పొలాల్లో ఏర్పాటు చేసుకునే కుంటలు ఎంతగానో ఉపయోగపడతాయని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

అడుగంటిన సమయంలో..

తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పొలాల్లో వేసిన బోర్లు, బావులు అడుగంటి పోయేందుకు అవకాశం ఉంది. అలాంటి పరిస్థితులను అధికమించేందుకుగాను ప్రతి రైతు తమ పొలంలో నీటిబ్యాంకు (నీటి కుంటలు)ను ఏర్పాటు చేసుకొని భూమిపై పడిన ప్రతి నీటిచుక్కనూ వడిసిపట్టేందుకు ప్రయత్నించాలని కొరిశపాడు మండల వ్యవసాయాధికారి పి.శ్రీనివాసరావు తెలిపారు. వర్షాలు లేని సమయంలో ఇవి ఉపయోగపడతాయి. పూర్వ కాలంలో ఇలాంటి కుంటలు ఉండేవి, కాల క్రమంలో భూమి విలువ పెరిగిన తర్వాత కుంటలు కనుమరుగైన విషయం తెలిసిందే.

నీటి కుంటలతో ప్రయోజనాలు..

ప్రతి రైతు తమ పొలంలో నీటి ప్రవాహం చేరే చోట కుంటలను తవ్వుకోవాలి. వర్షపు నీరు కుంటలో చేరిన నీటిలో నత్రజని శాతం ఎక్కువగా ఉంటుంది. ఈ నీటిని వ్యవసాయానికి గానీ మొక్కల పెంపకానికి గానీ వినియోగించుకోవడం వలన పంటలు ఆరోగ్యంగా అధిక పంటలను పండేందుకు దోహదపడతాయి. రైతుల అవసరాలను బట్టి 8X8 సైజులో కానీ 25X25 సైజులో.. 2లేదా 3మీటర్ల లోతులో నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలి. 8X8X2 సైజులో నిర్మించుకున్న కుంటలో 72వేల లీటర్ల నీరు నిల్వ ఉంటుంది. ఈ విధంగా రైతులు పొలాల్లో నీటి కుంటను ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భజలాలు పెరగడంతో పాటు పంట బెట్టకు రాకుండా కాపాడుకోవచ్చు.


పంట భూమిలో ఏర్పాటు చేసుకున్న నీటి నిల్వ

హనుమంత వాహనంపై శ్రీవారి ఉత్సవం


హనుమంత వాహనంపై ఉత్సవ మూర్తులు

కొనకనమిట్ల: శ్రీవారి బ్రహ్మోత్సవాల వేళ వెలుగొండ క్షేత్రం భక్తుల జయజయ ధ్వానాలతో పరవశించి పోతోంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీవారికి రోజుకొక అవతారంలో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం శ్రీవారు పల్లకిలో అలంకరించిన హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీవారిని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య మేళతాళాలతో వెలుగొండ వీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు స్వామివారికి నైవేద్యాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఉత్సవ ఉభయదాతులుగా తాడి తిరుపతిరెడ్డి, చిన సుబ్బారెడ్డి, గాలిరెడ్డి, కొండారెడ్డి దంపతులు వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, ధర్మకర్తల పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వేదపండితులు ప్రసాదాచార్యులు, పవనకుమార్ శర్మ, సింహాద్రిచార్యులు స్వామివారికి అర్చనలు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. బుధవారం గరుడోత్సవ ఉత్సవం, ఎడ్లపందేలు జరుగుతాయని ఆలయ మేనేజరు చెన్నకేశవరెడ్డి, చైర్మన్ తిరుపతిరెడ్డి తెలిపారు.

తిరునాళ్లకు పటిష్ఠ బందోబస్తు:

వెలుగొండలో 15, 16 తేదీలలో నిర్వహించే శ్రీవారి బ్రహ్మోత్సవ తిరునాళ్లను పురస్కరించుకొని తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీస్ బందోబస్తు పటిష్ఠంగా అమలు చేస్తామని ఎస్ఐ కడలి దీపిక అన్నారు. మంగళవారం ఆమె ఆలయ చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డితో కలిసి వెలుగొండ క్షేత్రంలో పర్యటించారు. వెలుగొండస్వామి ఆలయం, కొండపై ఉన్న పీఠమీదలక్షమ్మ ఆలయం, గంగాభవాని ఆలయాలను పరిశీలించారు. తిరునాళ్ల ఏర్పాట్లపై చైర్మన్ తిరుపతిరెడ్డితో చర్చించారు. అన్నదాన సత్రాల నిర్వహణ, తిరునాళ్లలో షాపులు నిర్వహణ, ట్రాఫిక్ ఏర్పాట్ల గురించి ఎస్ఐ మాట్లాడారు. విద్యుత్ ప్రభల ఏర్పాటు, ఎడ్ల పోటీలు నిర్వహించే ప్రాంతాన్ని, రథం తిరిగే చోట పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. రెండు రోజులపాటు తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సీఐ సుధాకరరావు ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్ఐ దీపిక అన్నారు.

జి-20 సమ్మిట్ పోటీల్లో క్యాడెట్ల ప్రతిభ


పతకాలు సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందిస్తున్న బెటాలియన్ కల్నల్‌సునీల్ కుమార్, ఎన్‌సీసీ అధికారులు

చీరాల టౌన్: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 23 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జి-20 సమ్మిట్ పోటీల్లో చీరాల వీఆర్‌ఎస్ అండ్‌వైఆర్ఎన్ ఎన్‌సీసీ క్యాడెట్లు విశేష ప్రతిభచూపి పతకాలు సాధించారు. గత సంవత్సరం డిసెంబర్ 1 నుంచి ఎన్‌సీసీ క్యాడెట్లకు నిర్వహిస్తున్న జి-20 సమ్మిట్ క్విజ్, వ్యాసరచన పోటీలకు బెటాలియన్ పరిధిలో పలు కళాశాలలు, హైస్కూళ్లకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ సునీల్ కుమార్ అభినందించి సత్కరించారు. సీనియర్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో వీఆర్‌ఎస్ కళాశాలకు చెందిన క్యాడెట్లు తిరుమలశెట్టి తన్మయి ప్రథమ బహుమతిని, మక్కెన సువర్ణకుమారి ద్వితీయ బహుమతిని, నర్సరావుపేట ఇంజినీరింగ్ కళాశాలకు చెదిన బి.యువరాజు తృతీయ స్థానాలు సాధించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన బహుమతులను ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్ పంపిణీ చేశారు. కల్నల్ మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్లు సమాజ సేవా కార్యక్రమాలతో పాటు కరెంట్ అఫైర్స్, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో ప్రతిభచూపి పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. బెటాలియన్ సుబేదార్‌లు కృష్ణన్ కుమార్, లక్ష్మణ్ నేగీ, ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్‌బాబు, హరీష్, గోపీనాథ్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

నేటి నుంచి సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

పెద్దారవీడు: మండలంలో తోకపల్లె గ్రామంలో లక్ష్మణ హనుమాత్ సమేత శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహ, విమాన శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం నుంచి శుక్రవారం వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మంగళవారం సాయంత్రం అర్చకులు పెరుగువల్లి సబ్రమణ్యంశర్మ, పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. శుక్రవారం ఉదయం 8.17 గంటలకు యంత్ర, విగ్రహ, ధ్వజస్తంభ, ఆలయ విమాన శిఖర ప్రతిష్ఠ, స్వామి ప్రథమ దర్శనం, దృష్టి కుంభం పూజలు తదనంతరం సీతారామచంద్రస్వామి శాంతి కళ్యాణం నిర్వహించనున్నట్లు అర్చకులు వివరించారు. అన్నదానంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని గ్రామస్తులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు


క్షతగాత్రురాలు బాలమణి

మేదరమెట్ల: రోడ్డు దాటుతున్న మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం రాత్రి తిమ్మనపాలెం జాతీయ రహదారిపై జరిగింది. గ్రామం వద్ద వ్యక్తిగత పని ముగించుకొని రోడ్డు దాటుతున్న గుండ్ల బాలమణి అనే మహిళను గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొంది. గాయాలపాలైన ఆమెను 108లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

జామాయిల్ తోటలో అగ్ని ప్రమాదం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది, ఎస్సై

మేదరమెట్ల: మేదరమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని అద్దాల ఫ్యాక్టరీ పక్కన మానుగుంట సుబ్బారావు జామాయిల్ తోటలో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. గస్తీ నిర్వహిస్తున్న హైవే మొబైల్ సిబ్బంది మేదరమెట్ల ఎస్సై శివకుమార్‌కు సమాచారం అందజేశారు. ఆయన అద్దంకి అగ్నిమాపక కేంద్రానికి తెలిపారు. సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

గోవా మద్యం సీసాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం, వాహనాలతో పోలీసులు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో పర్చూరు సెబ్ సీఐ ముప్పాళ్ల యశోధరా దేవి తమ బృందంలో మంగళవారం నిర్వహించిన దాడిలో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 57 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలించి స్థానికంగా విక్రయిస్తున్నారనే ముందస్తు సమాచారంతో అధికారులు స్థానిక కొణిదెన రోడ్డులో నిఘా ఉంచారు. రెండు ద్విచక్రవాహనాలను ఆపి తనిఖీ చేయగా స్థానిక టీచర్స్ కాలనీలో నివాసముండే కాటూరి రవికి చెందిన బైకులో గోవా రాష్ట్రానికి చెందిన 40 క్వార్టర్ మద్యం బాటిళ్లు, కొణిదెన రోడ్డుకు చెందిన షేక్ కరిముల్లా స్కూటీలో 15 గోవా క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని అదుపులోనికి తీసుకున్నారు. వీరిద్దరికి కొరిశపాడు మండల కేంద్రానికి చెందిన కాటూరి శ్రీరామచంద్రమూర్తి అలియాస్ చందు గోవా నుంచి సరఫరా చేస్తున్నారని చెప్పటంతో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. చందు కోసం గాలించగా అప్పటికే అతను పరారీలో ఉన్నట్లు తెలిపారు.